ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 30.0 । కనిష్ఠం : 22.0
ANDHRAJYOTHY
5

మహబూబ్‌నగర్
జిల్లా వార్తలు
శనివారం 14 సెప్టెంబరు 2024

రోడ్డున పడ్డ.. పాడి రైతు

- రెండు నెలలుగా అందని బిల్లులు
- నాగర్‌కర్నూల్ జిల్లాలో పదివేల మందికిపైగా ఎదురుచూపు
- ధర్నాలు, రాస్తారోకోలతో నిరసనలు
- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డికి వినతి
- కుటుంబ, పోషణ భారంగా మారిందని ఆవేదన



కల్వకుర్తి మండలం మార్చాలలో రోడ్డుపై పాలు పారబోసి నిరసన వ్యక్తం చేస్తున్న పాడి రైతులు(ఫైల్)

కల్వకుర్తి, సెప్టెంబరు 13: ప్రభుత్వం పాల బిల్లులు చెల్లించకపోవడంతో పాడి రైతులు రోడ్డెక్కుతున్నారు. వ్యవసాయానికి అనుబంధంగా ఉన్న పాడి పరిశ్రమపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని వాపోతున్నారు. ప్రతీ 15 రోజులకు ఒకసారి బిల్లులు చెల్లించాల్సిన అధికారులు రెండు నెలలు కావస్తున్నా విడుదల చేయకపోవడంతో ఆందోళన బాట పడుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో అచ్చంపేట, కల్వకుర్తిలలో పాల శీతలీకరణ కేంద్రాలు ఉన్నాయి. ఏడు బీఎంసీయూ(బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్)లు కుప్పనగండ్ల, కొండారెడ్డిపల్లి, కొండూరు, మాదారం, ఊర్కొండపేట, నాగర్‌కర్నూల్, వెల్దండలో ఉన్నాయి. వాటిద్వారా 10 వేల మందికి పైగా ఉన్న రైతుల ద్వారా విజయ డైరీ గత ఏడాది 68 వేల లీటర్ల పాల సేకరణ చేపట్టగా, ప్రస్తుతం లక్ష లీటర్ల వరకు సేకరిస్తున్నారు. 15 రోజులకు ఒకసారి రైతులకు రూ.7.8 కోట్ల చొప్పున నెలకు రూ.15.6 కోట్లు పాల బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఈ నెల 15వ తేదీ వస్తే రైతులకు నాలుగు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

పై అధికారులకు నివేదించా



పాడి రైతులకు చెల్లించాల్సిన పాల బిల్లులను వెంటనే విడుదల చేయాలని పై అధికారులకు నివేదించా. బిల్లులు వచ్చిన వెంటనే రైతులకు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటాం.

- జి.ధనరాజ్, పాడి పరిశ్రమ అభివృద్ధి, సహకార సమాఖ్య ఉప సంచాలకులు

బిల్లుల కోసం నిరసనలు

పెండింగ్ పాల బిల్లులను పాడి పరిశ్రమ అభివృద్ధి, సహకార సమాఖ్య నుంచి ప్రభుత్వం విడుదల చేయాలని రైతులు ధర్నాలు, రాస్తారోకోలు చేపడుతున్నారు. ఈ నెల ఐదో తేదీన కల్వకుర్తి మండలం మార్చాలలో, ఏడున వెల్దండ మండలం బండోనిపల్లి పాల సేకరణ కేంద్రం వద్ద ఆందోళనలు చేశారు. ఊర్కొండలో ఎనిమిదిన రాస్తారోకోలు చేశారు. పాలను రోడ్లపై పారబోసి నిరసన తెలిపారు. జిల్లాలోని బీఎంసీయూల పరిధిలో రోజూ ఏదో ఒక చోట ఆందోళనలు చేపడుతున్నారు. బిల్లులు చెల్లించాలని ఈ నెల 10న వెల్దండలో ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డికి వినతి పత్రం ఇచ్చారు.

రాజాపూర్‌లో రాస్తారోకో



పాలను రోడ్డుపై పారబోస్తున్న నాయకులు; చిత్రంలో పాడి ఆవు

రాజాపూర్: పాడి రైతులకు బిల్లులు చెల్లించడం లేదని మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై రైతులతో కలిసి బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం రాస్తారోకో చేశారు. పాలు పారబోశారు. రెండు నెలలుగా బిల్లులు చెల్లించకపోవడంతో ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, మాజీ సర్పంచు బచ్చిరెడ్డి, నాయకులు శ్రీను, తిరుపతయ్య, రైతులు పాల్గొన్నారు.

పిల్లల ఫీజులు కట్టలేకపోతున్నాం



నేను రోజూ 15 లీటర్ల పాలు విజయ డైరీకి పోస్తున్నా. నెలకు రూ.18 వేల వరకు బిల్లు వచ్చేది. 45 రోజులకు మూడు బిల్లులు ఇవ్వలేదు. కుటుంబ, పశుపోషణ భారంగా మారింది. పిల్లలకు ఫీజులు కట్టడానికి, పెట్టుబడులకు ఇబ్బందులు పడుతున్నా.

- రైతు కంకాల శ్రీశైలం, పాడి రైతు, మార్చాల

ప్రభుత్వం ఆదుకోవాలి



పాడి రైతులకు బిల్లులు సక్రమంగా చెల్లించాలంటే ప్రభుత్వం విజయ డైరీ కార్పొరేషన్‌కు రూ.500 కోట్ల సహాయం అందించాలి. దాణా, మినరల్ మిక్చర్ ధరలు పెరిగాయి. ఇటీవల కురిసిన వర్షానికి గడ్డి పాడైంది. బిల్లులు సకాలంలో రాకపోవడంతో రైతులకు అప్పులు ఇవ్వడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. ఈఎంఐలు, పిల్లల ఫీజులు కట్టడానికి ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం పెండింగ్ బిల్లులను చెల్లించి ఆదుకోవాలి.

- పాడి రైతు, కృష్ణారెడ్డి

మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మిస్తాం

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- శ్రీశైలం ముంపు నిర్వాసితులనూ ఆదుకుంటాం
- అలంపూర్ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

అలంపూర్ చౌరస్తా, సెప్టెంబరు 13: అలంపూర్ నియోజకవర్గాన్ని సస్యశామలం చేసేందుకు తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం కింద మల్లమ్మకుంట రిజర్వాయర్‌ను పూర్తి చేస్తామని, అందుకోసం సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ చౌరస్తాలోని మార్కెట్ యార్డులో శుక్రవారం నిర్వహించిన వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఎక్సైజ్, పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి పాల్గొన్నారు. చైర్మన్‌గా బింగిదొడ్డి దొడ్డప్ప, వైస్ చైర్మన్‌గా పచ్చర్ల కుమార్, మరో 16 మంది సభ్యులతో జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి పుష్పమ్మ ప్రమాణ స్వీకారం చేయించారు. అంతకుముందు వారు జోగుళాంబ అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో వ్యవసాయ రంగంలో రాష్ట్రం ముందుకు పోతోందన్నారు. పదేళ్లలో బీఆర్‌ఎస్ ఇచ్చిన హామీలను ఎగ్గొట్టడమేగాక రుణమాఫీపై లేనిపోని ఆరోపణలు చేస్తోందన్నారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ.7,500 మంజూరు చేసేందుకు సీఎం సిద్ధంగా ఉన్నారన్నారు. రైతులు పంటలు సాగు చేసి నష్టపోవద్దని, ప్రతీ ఎకరాకు ఇన్సూరెన్స్ ప్రీమియమ్ చెల్లిస్తున్నామన్నారు. సబ్ మార్కెట్‌గా ఉన్న అయిజకు కూడా భవిష్యత్‌లో నూతన మార్కెట్ కమిటీని నియమిస్తామని హామీ ఇచ్చారు. శ్రీశైలం నిర్వాసితులను ఆదుకుంటామని, వచ్చే ఏడాది నాటికి బీచుపల్లి వద్ద ఉన్న ఆయిల్ ఫ్యాక్టరీని పూర్తిగా అందుబాటులోకి తెస్తామని చెప్పారు.

శ్రీశైలం నిర్వాసితులను బీఆర్‌ఎస్ మోసం చేసింది : మంత్రి జూపల్లి

1985 నుంచి వంచనకు గురైన శ్రీశైలం నిర్వాసితులను గడిచిన పదేళ్లలో కేసీఆర్ కూడా మోసం చేశారని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. తమ ప్రభుత్వం హయాంలో ఆర్థిక సాయం చేసేందుకు సీఎంతో చర్చిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రకటనకు ముందు సభ మధ్యలో ముంపు నిర్వాసితులు తమకు న్యాయం చేయాలంటూ బ్యానర్ ప్రదర్శించారు. ఆర్డీఎస్ రైతులకు న్యాయం చేసేందుకు ఆనాడు సంపత్ తుమ్మిళ్ల కోసం పోరాటం చేశాడన్నారు. ప్రాజెక్టు వచ్చినా బీఆర్‌ఎస్ ప్రభుత్వం రిజర్వాయర్లను నిర్మించడంలో విఫలమైందన్నారు. రిజర్వాయర్లు నిర్మించడమేగాక.. జూరాల సామర్థ్యాన్ని పెంచి, ఆర్డీఎస్‌కు లింకు చేసే ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. ఆయిల్ పామ్ పండించే రైతులకు ఏడాదికి రూ.1.5 లక్షల ఆదాయం వచ్చేలా చూస్తామన్నారు.

ఓట్ల కోసమే ఆస్పత్రి నిర్మాణం: సంపత్

ఆనాడు అలంపూర్ ప్రజల ఓట్లు దండుకునేందుకే హడావిడిగా వంద పడకల ఆస్పత్రిని ప్రారంభించారని మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ అన్నారు. కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ఆస్పత్రి నేడు అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారిందన్నారు. ఆస్పత్రిని వినియోగంలోకి తెచ్చేందుకు మంత్రులు సహకరించాలని కోరారు. అలంపూర్ చౌరస్తాలో మినీ బస్‌డిపోను ఏర్పాటు చేయాలని, ఆర్డీఎస్‌ను ఆధునీకరించాలని, మల్లమ్మకుంట, వల్లూరు, జులెకల్ రిజర్వాయర్లను కూడా నిర్మించాలని మంత్రి తుమ్మలను కోరారు. సభ మధ్యలో ఓ వృద్ధుడు లేచి అలంపూర్‌లో అన్యాక్రాంతం అవుతున్న సీలింగు భూములను కాపాడాలని నినదించాడు. కార్యక్రమంలో కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావు, ఆర్డీవో రామచందర్, మార్కెటింగ్ ప్రాంతీయ ఉప సంచాలకులు ప్రసాదరావు, కార్యదర్శి ఎల్లస్వామి, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

జోగుళాంబ గద్వాలలో.. 16 డెంగీ కేసులు

- జూన్ నుంచి చేపట్టిన ఇంటింటి సర్వే
- 144 మంది జ్వర పీడితులు
- ఎలీసా పద్ధతిన పరీక్షలు
- వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యాధికారులు

గద్వాల న్యూటౌన్, సెప్టెంబరు 13: జోగుళాంబ గద్వాల జిల్లాలో జూన్ నుంచి ఇప్పటి వరకు 16 డెంగీ కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం వ్యాధుల కాలం కావడంతో జూన్ నుంచి వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఫీవర్ సర్వే చేపడుతున్నారు. ఆశ కార్యకర్తలు రోజూ ఒక్కొక్కరు 50 ఇళ్లకు వెళ్లి సర్వే చేస్తున్నారు. జ్వరాలు వచ్చిన వారు ఉంటే పేర్లను నమోదు చేసుకుంటున్నారు. తాత్కాలిక ఉపశమనంగా పారాసిటమాల్ ట్యాబ్లెట్లను ఇస్తున్నారు. జ్వరం తగ్గకుంటే పీహెచ్‌సీలకు లేదా సబ్ సెంటర్లకు పంపుతున్నారు. అక్కడ రక్త పరీక్షలు నిర్వహించి, మెడికల్ అధికారులతో ట్రీట్‌మెంట్ ఇప్పిస్తున్నారు. అయినా నయం కాకపోతే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి పంపుతున్నారు.

2,079 మందికి పరీక్షలు

జిల్లాలో జూన్ నుంచి 2,079 మందికి ఫీవర్ సర్వే చేశారు. వారిలో 144 ఫీవర్ కేసులు నమోదైనట్లు అధికారులు చెప్పారు. 16 డెంగీ కేసులు నమోదు కాగా, ఎవరికీ ప్రాణాపాయం సంభవించలేదని తెలిపారు. చికున్‌గున్యా, మలేరియా కేసులు నమోదు కాలేదు. జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రితో పాటు అన్ని పీహెచ్‌సీలలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా తదితర వ్యాధులను ఎలీసా పరీక్షలతో నిర్ధారణ చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. కిట్ పద్ధతి ద్వారా రోగ నిర్ధారణ సరైన పద్ధతి కాదని అంటున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లు కిట్ పద్ధతిలో రోగాలు నిర్ధారణ చేసి ప్రజలను భయపెడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో కిట్ పద్ధతితో పాటు ఎలీసా పద్ధతిలో 2,079 మందికి పరీక్షల చేసినట్లు తెలిపారు.

11 ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలు

జిల్లాలో ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే చేస్తున్నామని, జ్వరం ఉంటే మందులు ఇస్తున్నామని అధికారులు చెబుతున్నారు. గ్రామాల్లో నలుగురు జ్వరం బారిన పడితే అక్కడ వెంటనే క్యాంపులను ఏర్పాటు చేస్తున్నామని, పరీక్షలు చేసి, మందులను పంపిణీ చేస్తున్నామని అంటున్నారు. ఒక డెంగీ కేసు నమోదైనా ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలు రంగంలోకి దిగుతున్నాయని డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్ధప్ప తెలిపారు. జిల్లాలో 11 ర్యాపిడ్స్ టీంలు ఉన్నాయన్నారు. ఇవి కేసు నమోదైన ఇంటితో పాటు చుట్టు పక్కల ఉన్న 50 ఇళ్లకు యాంటీలార్వా స్ప్రే చేయడంతో పాటు ఆయిల్‌బాల్స్‌ను కూడా వేసి లార్వాలను పూర్తి స్థాయిలో నివారించే చర్యలు చేపడతారన్నారు. డెంగీ సోకిన వారి ఇంట్లో, బయట పైరతమ్ స్ప్రే చేయిస్తూ, డెంగీ నివారణకు కృషి చేస్తున్నామన్నారు.



డ్రైడేలో భాగంగా నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

జ్వరం వస్తే సమాచారం ఇవ్వాలి



జిల్లాలో వైద్య సిబ్బంది ఇంటింటి వెళ్లి ఫీవర్ సర్వే చేస్తున్నారు. ఎవరైనా జ్వరంతో బాధపడితే వైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. జ్వరం తీవ్రంగా ఉంటే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలి. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పరిసరాలను, ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలి. గ్రామాలలో వైద్యసిబ్బంది అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రతీ శుక్రవారం డ్రైడేను నిర్వహిస్తున్నాం.

- డాక్టర్ సిద్ధప్ప, గద్వాల డీఎంహెచ్‌వో

ప్రభుత్వంపై తిరగబడటానికీ సిద్ధం

- ఉదండాపూర్ నిర్వాసితులకు ప్యాకేజీ పెంచాల్సిందే
- ఆరు నెలల్లో పునరావాసం కల్పిస్తాం
- జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి



నిర్వాసితులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, సెప్టెంబరు 13: ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితులకు, ముంపువాసులకు అండగా ఉంటానని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి హామీ ఇచ్చారు. తాను అధికార పార్టీలో ఉన్నానని, అయినా నిర్వాసితుల పక్షాన పోరాటం చేసేందుకు ప్రభుత్వంపై తిరగబడతానని చెప్పారు. జడ్చర్ల మండలం దేవునిగుట్ట తండాకు వెళ్లే దారిలో ముంపువాసులకు పునరావాస కల్పించే స్థలంలో ఉదండాపూర్, వల్లూరు గ్రామాలు, ముంపునకు గురవుతున్న తండాల ప్రజలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉదండాపూర్ నిర్వాసితులకు, ముంపు గ్రామాల వారికి ప్యాకేజీ పెంచాల్సిందేనని చెప్పారు. కాంట్రాక్టర్లకు రూ.వందల కోట్లు పెంచినప్పుడు సర్వం కోల్పోతున్న నిర్వాసితులకు సైతం పరిహారం పెంచాలన్నారు. పరిహారం పెంచేందుకు డబ్బులు లేవంటే ఒప్పుకోనన్నారు. పునరావాసం కల్పించే ప్రాంతంలో ఆరు నెలల్లోగా అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేయించి, అందచేస్తామని వెల్లడించారు. రెవెన్యూ సమస్యలపై ఈ నెల 20న మొదటగా వల్లూరు గ్రామంలో అదనపు కలెక్టర్, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో ఉదండాపూర్ రిజర్వాయర్ గుండె వంటిదని, ప్రాజెక్టు పూర్తయితే దాదాపు ఎనిమిది లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఈ ప్రాజెక్టులో ఎక్కువగా నష్టపోయింది ఉదండాపూర్, వల్లూరు గ్రామస్థులేనన్నారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లానని, పరిహారం పెంచే విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉందని వెల్లడించారని తెలిపారు. ముంపు గ్రామాలలో చేపట్టిన సర్వేలలో అవకతవకలు జరిగాయని, అధికారులు ఒక్కో సందర్భంలో ఒక్కో మాదిరిగా మాట్లాడి మభ్యపెడుతున్నారంటూ నిర్వాసితులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అవసరమైతే రీ సర్వే చేయించి, జరిగిన అవకతవకలను సరిదిద్దేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భూసేకరణ స్పెషల్ కలెక్టర్ ముకుంద్‌రెడ్డి, అదనపు కలెక్టర్ మోహన్‌రావు, ఇరిగేషన్‌శాఖ ఎస్‌ఈ శ్రీనివాస్, జడ్చర్ల తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, ఇరిగేషన్‌శాఖ, రెవెన్యూశాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలి

- రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి



విద్యార్థికి ట్రోఫీని అందజేస్తున్న గురునాథ్‌రెడ్డి

కోస్గి, సెప్టెంబరు 13: విద్యార్థులను చదువుతోపాటు క్రీడల్లో ప్రోత్సహించాలని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మెన్ గురునాథ్‌రెడ్డి అన్నారు. కాడా ఆధ్వర్యంలో శుక్రవారం కోస్గిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన చెస్ పోటీలకు కలెక్టర్ సిక్తా పట్నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గురునాథ్‌రెడ్డి మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి కొడంగల్ ఎమ్మెల్యేగా గెలిచి, రాష్ట్ర ముఖ్యమంత్రి అయినప్పటినుంచి ప్రధానంగా విద్యా వ్యవస్థపైనే దృష్టి పెట్టారన్నారు. విద్యార్థులకు మంచి బోధన అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కొడంగల్‌లో కాడా ఆధ్వర్యంలో చెస్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీలు నిర్వహించేందుకు ఉపాధ్యాయులు వీర మల్లేష్, చెస్ శిక్షకుడు ఆనంద్ ముందుకు రావడం, వారిని కాడా అధికారి వెంకట్‌రెడ్డి ప్రోత్సహించడం సంతోషకరమన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇలాంటి పోటీలు నిర్వహించడం గర్వకారణమన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్‌గని, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో శ్రీధర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పీఏసీలో ఇద్దరు ఎమ్మెల్యేలకు చోటు

- యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణలకు అవకాశం




యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 13: పీఏసీ(తెలంగాణ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ)లో ఉమ్మడి జిల్లాలోని ఇద్దరు ఎమ్మెల్యేలకు చోటు లభించింది. ఈ మేరకు శుక్రవారం అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ చైర్మన్‌గా ఉన్న ఈ కమిటీలో మొత్తం 13 మంది సభ్యులు ఉన్నారు. రెండోసారి ఎమ్మెల్యే కావడం, ఉన్నత విద్యావంతులు, అనర్గళంగా మాట్లాడే సబ్జెక్టు ఉన్న యెన్నంకు అవకాశం లభించడంపై శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పసిడి మరింత ప్రియం

నారాయణపేట, సెప్టెంబరు 13: స్థానిక మార్కెట్‌లో బంగారు, వెండి ధరలు ఒక్కసారి భగ్గుమన్నాయి. ఎప్పుడూ లేని విధంగా రికార్డు స్థాయిలో పెరిగింది. గరిష్ఠంగా శుక్రవారం తులం ధర రూ.75,300 చేరుకోగా, కిలో వెండి రూ.88,600 చేరింది. ఒక్కరోజులోనే బంగారం అమాంతం రూ.800 పెరుగగా, వెండి 4100 పెరిగి కొనేవారికి ఆర్థికభారంగా మారింది.

దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు

వెల్దండ, సెప్టెంబరు 13: మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన కాయితి జయంత్‌రెడ్డి అనే వ్యక్తిపై దాడిచేసిన ఎనుముల శ్రీకాంత్‌రెడ్డిపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. వ్యవసాయ పొలంలో గురువారం ఇద్దరు ఘర్షణ పడడంతో శ్రీకాంత్‌రెడ్డి కర్రతో జయంత్‌రెడ్డిపై దాడిచేయగా గాయపడ్డాడు.ఈమేరకు జయంత్‌రెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు.

31మందికి జరిమానా

ఉండవల్లి, సెప్టెంబరు 13: మండల పరిధిలోని అలంపూర్ చౌరస్తా, టోల్‌ప్లాజా తదితర ప్రాంతాల్లో కొన్ని రోజుల క్రితం బహిరంగ ప్రదేశాల్లో మద్యంతాగి పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన 31మందిని శుక్రవారం అలంపూర్ కోర్టులో హాజరుపర్చినట్లు హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపారు. అందులో 26మంది బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడంతో వారికి ఒక్కొక్కరికీ రూ.1000 చొప్పున, ఐదుగురు డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడడంతో రూ.2000 చొప్పున జరిమానా విధిస్తూ అలంపూర్ కోర్టు న్యాయమూర్తి కె.కవిత తీర్పు ఇచ్చారని కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు.

ఉద్యాన పంటలతో ఏడాది పొడవునా ఉపాధి



రైతులకు విత్తనాలు, మల్చింగ్ కవర్లను అందజేస్తున్న ఉద్యాన కళాశాల డీన్ సైదయ్య

కొత్తకోట/పెద్దమందడి, సెప్టెంబరు 13 : ఉద్యానపంటల సాగుతో ఏడాది పొడవునా రైతులు ఉపాధి పొందవచ్చని ఉద్యాన కళాశాల డీన్ డాక్టర్ సైదయ్య అన్నారు. శుక్రవారం మొజర్ల, కనిమెట్టలో రైతులకు ఉద్యాన పంటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైదయ్య మాట్లాడుతూ తక్కువ భూమి ఉన్న రైతులు జీవనంపై బెంగ పడాల్సిన అవసరం లేదన్నారు. ఉద్యాన పంటలతో నష్టాలురావని, వచ్చినా తక్కువ శాతమేనని, రాబడి మాత్రం ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రజలు నిత్యం వినియోగించే అన్ని రకాల కూరగాయలు సాగు చేసుకుంటే ఇతరులపై ఆధార పడాల్సిన పనిలేదని తెలిపారు. .హైదరాబాద్‌లో నేటికి కేవలం 60శాతం కూరగాయలు మాత్రమే స్థానికంగా ఉత్పత్తి అవుతున్నాయని, నగరం చుట్టుపక్కల 100 కిలోమీటర్ల పరిధిలో కూరగాయలు పండించుకునేందుకు వీలుందని ఆయన తెలిపారు. అనంతరం రైతులకు కూరగాయల విత్తనాలతో పాటు సేంద్రియ ఎరువులు, మల్చింగ్ షీట్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఉద్యాన కళాశాల అధ్యాపకులు షహనాజ్, శ్రీనివాస్, చంద్రశేఖర్ కనిమెట్ట చిన్నమందడి, మొజర్ల, మద్దిగట్ల, జయన్న తిరుమలాయపూర్ గ్రామాలు రైతులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 12గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

లింగాల, సెప్టెంబరు 13: వీధి కుక్కలదాడిలో 12గొర్రెలు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మానా జిపెంటలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుడు మాడేం స్వామియాదవ్ తన జీవనాధారం కోసం గొర్రెలను పెంచుతూ కుటుంబాన్ని పోషించుకుం టున్నాడు. తన గొర్రెలు ఉండే దొడ్డిలో గురువారం అర్ధరాత్రి వీధి కుక్కలు చొరబడి 12గొర్రెలుపై దాడి చేయడంతో మృతి చెందాయి. వాటి విలువ రూ.లక్షా 20వేలు ఉంటుందని బాధితుడు మాడేం స్వామియాదవ్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 13: అనారోగ్యానికి గురై మనస్తాపం చెంది అర్ధరాత్రి వంటగదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని సాయినాథ్(30)అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ శుక్రవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం... నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని ఓం నగర్ కాలనీకి చెందిన సాయినాథ్ మానసికస్థితి సరిగా లేకపోవడంతో రెండేళ్లుగా ఇంట్లోనేఉంటున్నాడు. అర్ధరాత్రి నిద్రలో లేచి వెళ్లి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన కుమారుడు మృతిపై ఎలాంటి అనుమానం లేదని తల్లి వనజకుమారి ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

డయాలసిస్ రోగులకు మెరుగైన వైద్యసేవలు

నిమ్స్ నెఫ్రాలజి విభాగాధిపతి డాక్టర్ స్వర్ణలత



రోగులతో మాట్లాడుతున్న డాక్టర్ స్వర్ణలత

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), సెప్టెంబరు 13: డయాలసిస్ రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రి నెఫ్రాలజి విభాగాదిపతి డాక్టర్ స్వర్ణలత అన్నారు. శుక్రవారం ఆమె జనరల్ ఆసుపత్రిలోని డయాలసిస్ విభాగాన్ని పరిశీలించారు. పలువురు రోగులతో మాట్లాడి డయాలసిస్ సక్రమంగా చేస్తున్నారా? ఎన్ని నెలలకు వస్తున్నారు? సౌకర్యాలు బాగున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. చిన్నవయస్సు కిడ్నీ బాధితురాలితో మాట్లాడుతూ కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకోవాలని చెప్పారు. దాతలు ఉన్నారా అని అడుగగా తనతండ్రి ఉన్నారని చెప్పడంతో ఆమె డయాలసిస్ విభాగం ఇన్‌చార్జికి పలు సూచనలు చేశారు. ఇలాంటి రోగులు ఎవరైనా ఉంటే వారికి కౌన్సెలింగ్ ఇప్పించాలని, ఎవరైనా కిడ్నీ ఇవ్వడానికి ముందుకు వస్తే వారిని వెంటనే నిమ్స్‌కు పంపించాలని, అక్కడ కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స చేయిస్తానని తెలిపారు. అనంతరం ఎంతమందికి డయాలసిస్ సేవలు అందించారనే అంశాలపై రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. సంపత్‌కుమార్, ఆర్ఎంవోలు డా. శిరీషా, డా. శ్వేత, డయాలసిస్ కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జూరాల ప్రాజెక్టుపై మొసలి



జూరాల ప్రాజెక్టుపైకి వచ్చిన మొసలిని బంధిస్తున్న మత్స్యకారుడు

అమరచింత, సెప్టెంబరు 13: జూరాల ప్రాజెక్టు ప్రధాన రహదారిపై శుక్రవారం ఉదయం మొసలి కనిపించింది. దీంతో ఆ దారిలో వెళ్లే వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. రాత్రివేళ బ్యాక్ వాటర్ నుంచి మొసలి ఒడ్డుకు చేరి ఉంటుందని తెలిపారు. ప్రధాన ఎడమ కాలువ పుష్కర ఘాట్‌కు వెళ్లే రహదారి సమీపంలో ఈ మొసలి తెల్లవారుజామున చేపలవేటకు వెళ్లిన మత్స్యకారులకు కనిపించింది. దీంతో వారు తాళ్లతో బంధించి తిరిగి జూరాల బ్యాక్‌వాటర్‌లో వదిలేశారు. ప్రాజెక్టు ప్రధాన రహదారిపై మొసలి ఉన్నట్లు వార్త సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నందిమల్ల, బీజేపీ క్యాంపు క్వార్టర్‌లో ఉన్న ప్రజలు, విద్యార్థులు పెద్దసంఖ్యలో మొసలిని చూడడానికి వచ్చారు.

యుద్ధం చెర నుంచి ఇంటికి..

- దుబాయ్‌లో ఏజెంట్ మోసం

- బలవంతంగా ఉక్రెయిన్, రష్యా యుద్ధభూమికి తరలింపు

- అతికష్టం మీద ఇంటికి చేరుకున్న పేట వాసి సూఫియాన్



పేటలో తల్లిదండ్రులతో సూఫియాన్

నారాయణపేట,సెప్టెంబరు 13: వారంతా పొట్టకూటి కోసం దుబాయ్ వెళ్లారు. అక్కడ ఏజెంట్ మోసం చేయడంతో అప్పటికే జరుగుతున్న ఉక్రెయిన్, రష్యా యుద్ధంలో ప్రైవేటు సైన్యానికి తరలించబడ్డాడు. గతేడాది నవంబరు 16న ఉక్రెయిన్- రష్యా బార్డర్‌కు చేరుకొన్న వీరు అప్పటి నుంచి రష్యా సైనికులకు సహాయకులుగా పనిచేస్తూ యుద్ధభూమిలో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఇలా అక్కడ చాలామంది భారతీయులు ఇరుక్కుపోయిన వారికి విముక్తి లభించింది. అందులో నారాయణపేటకు జిల్లా కేంద్రానికి చెందిన సూఫియాన్ ఒకరు కాగా అతడితో పాటే కర్ణాటకలోని గుల్బర్గాకు చెందిన ఇలియాస్, సమీర్‌అహ్మద్, నయిమ్‌షేక్‌లు శుక్రవారం స్వగ్రామాలకు చేరుకున్నారు. నారాయణపేట జిల్లా కేంద్రానికి చెందిన జహీర్, నసీమా దంపతుల రెండవ కుమారుడు సయ్యద్ మహ్మద్ సూఫియాన్ ఇంటర్ వరకు చదువుకున్నాడు. 2021లో పొట్టకూటి కోసం దుబాయి వెళ్లాడు. అక్కడ హోటల్‌లో పనికి కుదరగా నెలకు రూ.30వేల వరకు వచ్చేవి. ఈ క్రమంలో అతడికి బాబ అనే వ్యక్తి పరిచయమై దుబాయిలో రూ.30 వేలే వస్తాయని రష్యాలో లక్ష వరకు ఇప్పిస్తానని అందుకోసం రూ.3లక్షలు చెల్లించాల్సిందిగా సూఫియాన్‌కు చెప్పాడు. ఎక్కువ జీతం వస్తుందని ఆశపడ్డ సూఫియాన్ తల్లిదండ్రులకు విషయం తెలపడంతో వారు అప్పు చేసి రూ.3లక్షలు పంపారు. వాటిని సూఫియాన్ బాబకు అందజేయగా అతడు 2023 నవంబర్‌లో రష్యాకు పంపించాడు. మొదట సెక్యూరిటీ పోస్టులో జాబ్ అని చెప్పి తర్వాత ప్రైవేటు సైన్యంలో సహాయకులుగా ఉపయోగించుకుంటున్నారు. ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలపగా వారు చేయని ప్రయత్నం లేదు. రష్యాలోని భారత రాయబార కార్యాలయంతో పాటు తెలిసిన అధికారులను కలిసి విన్నవించారు. నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి కూడా కుటుంబ సభ్యుల వద్ద వివరాలు తీసుకొని సీఎం రేవంత్‌రెడ్డి ద్వారా కేంద్రానికి లేఖ రాశారు. ఇలా భారత్ నుంచి అక్కడ ఇరుక్కుపోయిన వారి విషయంలో ఇటీవల రష్యా పర్యటనకు వెళ్లిన ప్రధాని నరేంద్రమోదీ ఆ దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో జరిగిన సమావేశంలో చర్చించారు. అందుకు పుతిన్ కూడా సానుకూలంగా స్పందించారు. సూఫియాన్‌తో పాటు ఆ దేశంలో ఇరుక్కుపోయిన మిగతా భారతీయులు కూడా విడుదల అయ్యారు. తొమ్మిది నెలలుగా యుద్ధభూమిలో ఇబ్బందులు పడుతూ రోజుకు ఓసారి భోజనం చేస్తూ తుపాకీ చేత పట్టుకొని బిక్కుబిక్కుమంటు జీవనం కొనసాగించామని సూఫియాన్ తల్లిదండ్రులు, బంధువుల ముందు వాపోయాడు. తమబాధను గుర్తించి ప్రధాని నరేంద్రమోదీ రష్యాతో మాట్లాడారని దాంతో విముక్తి లభించిందని పేర్కొన్నాడు. మీడియా, ప్రజాప్రతినిధుల కృషితో తాను ప్రాణాలతో ఈరోజు నారాయణపేకు చేరుకొని తల్లిదండ్రులను కలిశానని కంటతడి పెట్టారు. ఆరో తేదీన మాస్కోకు చేరుకున్నామని, అక్కడ్నుంచి ఈనెల 12నరాత్రి ఢిల్లీకి చేరుకొని ముగ్గురు కర్ణాటకలోని గుల్బర్గాకు, ఒకరు కలకత్తాకు, ఒకరు కశ్మీర్‌కు వెళ్లగా తాను హైదరాబాద్‌కు శుక్రవారం వచ్చి నారాయణపేటకు రాత్రి తొమ్మిది గంటలకు చేరుకిని తల్లిదండ్రులతో మాట్లాడి ఇంటికి చేరుకున్నానని తెలిపారు. నారాయణపేటలోని ఇంటికి చేరుకోన్న సూఫియాన్‌తో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ఫోన్‌లో మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకున్నారు.

నకిలీ పట్టాల విక్రయంలో ముగ్గురి రిమాండ్

- శ్రీకాంత్‌గౌడ్, కౌన్సిలర్ భర్త రాజు సహకారం..

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 13: క్రిష్టియన్‌పల్లి సర్వేనెంబర్ 523లో నకిలీ పట్టాలు సృష్టించి ప్లాట్‌లు విక్రయించుకున్నారన్న ఆరోపణలపై తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నలుగురుపై కేసు నమోదుచేసి ముగ్గురిని రిమాండ్ చేశారు. గతనెల అక్రమ నిర్మాణాలపేరిట 75ఇళ్లను కూల్చివేసిన ఘటన సంచలనం రేకెత్తించింది. కొందరు తన సంతకాలను ఫోర్జరీ చేసి డబ్బులకు ప్లాట్‌లు అమ్ముకున్నారని తహసీల్దార్ ఘాస్సీరాం పోలీసులకు ఫిర్యాదుచేయగా విచారణ చేసి ముగ్గురిని శుక్రవారం రిమాండ్ చేశామని డీఎస్పీ వెంకటేశ్వర్లు వెల్లడించారు. దొంగపట్టాలు సృష్టించి రూ.2లక్షల నుంచి రూ.3లక్షలకు ప్రభుత్వ భూమిని అమ్ముకున్నారని పేర్కొనగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. కేసులో ఏ1 నిందితుడు రాయుడు, ఏ2 నిందితుడు దేవాను అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన నేరం ఒప్పుకున్నారని ఈ కేసులో తమకు మాజీమంత్రి సోదరుడు శ్రీకాంత్‌గౌడ్, కౌన్సిలర్ రాణి భర్త రాజు సహకరించారని చెప్పారన్నారు. వారి వద్దనుంచి కొన్ని నకిలీ ఇండ్ల పట్టాలు, అగ్రిమెంట్ కాపీలు, కొన్ని జిరాక్స్ పత్రాలు, పట్టాతయారీకి ఉపయోగించిన రెవెన్యూ అధికారుల ముద్రతో పాటు టీఎండబ్ల్యూ కారును సీజ్ చేశామన్నారు. ప్రస్తుతం రాయుడు, దేవా, రాజును అరెస్ట్ చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించామని చెప్పారు. ఈ కేసు ఇంకా విచారణలో ఉన్నదని, ప్రజలు ప్రభుత్వ భూమిలో పట్టాలిస్తామని మధ్యవర్తులు, దళారులు చెబితే నమ్మి మోసపోవద్దన్నారు. ఎవరైనా నకిలీపత్రాలు తీసుకుని డబ్బులిచ్చి మోసపోతే రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సరైన ధ్రువపత్రాలతో ఫిర్యాదు చేయాలని కోరారు.

వేధిస్తున్న పోలీస్ సిబ్బంది కొరత

» ఏఎస్ఐ స్థాయి నుంచి హోంగార్డు వరకు ఖాళీలు » ఉన్న సిబ్బందికి పనిభారం » కొల్లాపూర్‌లో శాంతిభద్రతలు ప్రశ్నార్థకం



తెలుగు ముదిరాజ్ భవనంలో కొనసాగుతున్న పెంట్లవెల్లి పోలీస్‌స్టేషన్

కొల్లాపూర్, సెప్టెంబరు 13: నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గ ప్రజల శాంతి భద్రతలకు రక్షణగా నిలిచే పోలీస్‌శాఖలో సిబ్బంది కొరత వేధిస్తోంది. దీంతో నియోజకవర్గ ప్రజల్లో అభద్రత భావం మొదలైంది. మరోవైపు స్టేషన్లలో విధులు నిర్వహించే వారికి పనిభారం కూడా తప్పడంలేదు. నియోజకవర్గ పరిధిలోని కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి, పెంట్లవెల్లి, కోడేరు మండలాల్లో అరకొర పోలీస్ సిబ్బందితోనే ప్రజలకు సేవలందిస్తోంది. నియోజకవర్గకేంద్రంలో బహిరంగ సభలు, మంత్రుల పర్యటన సందర్భంగా బందోబస్తు చేపట్టాలన్నా అన్ని మండలాల పోలీస్ సిబ్బంది ఏకమవ్వాల్సిందే. నాలుగు మండలాల్లో మండలానికొక ఎస్ఐ ఉండగా వారితోపాటు కొల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో రెండవ ఎస్ఐ కూడా ఉంటారు. ఇటీవల ఆ పోస్టులో ఉన్న ఎస్ఐ మహబూబ్‌నగర్‌కు బదిలీ కావడంతో రెండవ ఎస్ఐ పోస్టు ఖాళీ అయ్యింది. కొల్లాపూర్ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ముగ్గురు ఏఎస్ఐలు ఉండాల్సి ఉండగా ఒక పోస్టు ఖాళీగా ఉంది. ఐదుగురు హెడ్‌కానిస్టేబుళ్లకుగాను ఒక్కరు మాత్రమే ఉన్నారు. స్టేషన్‌లో మొత్తం 30మంది కానిస్టేబుళ్లు ఉండాల్సి ఉండగా 14పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏడుగురు హోంగార్డులకుగాను నలుగురు మాత్రమే ఉన్నారు. సిబ్బంది పూర్తిస్థాయిలో భర్తీ అయితేనే క్షేత్రస్థాయిలో పోలీస్‌శాఖ సేవలందించగలదు. అదేవిధంగా పెద్దకొత్తపల్లి మండలంలోని రెండు ఏఎస్ఐ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. నలుగురు హెడ్‌కానిస్టేబుళ్లు ఉండాల్సి ఉండగా ముగ్గురు మాత్రమే ఉన్నారు. 21మంది కానిస్టేబుళ్ల పనిచేయాల్సి ఉండగా ఆరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కోడేరు మండలంలోని రెండు ఏఎస్ఐ పోస్టులకుగాను ఒకపోస్టు ఖాళీగా ఉంది. నలుగురు హెడ్‌కానిస్టేబుళ్ల ఉండాల్సి ఉండగా, రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మొత్తం 21మంది కానిస్టేబుళ్ల ఉండాల్సి ఉండగా పది మంది మాత్రమే ఉన్నారు. అదేవిధంగా నలుగురు హోంగార్డులకుగాను రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పెంట్లవెల్లి మండలంలోని పోలీస్ స్టేషన్‌లో రెండు ఏఎస్ఐ పోస్టులకుగాను ఒక్కరు మాత్రమే ఉన్నారు. 21మంది కానిస్టేబుళ్లకుగాను 11మంది మాత్రమే ఉన్నారు. నలుగురు హోంగార్డులకుగాను ముగ్గురు మాత్రమే ఉన్నారు. ఇలా అన్ని మండల కేంద్రాల్లో ఎస్ఐ స్థాయి నుంచి హోంగార్డు వరకు మొత్తం 143మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా 83మంది పోలీస్ సిబ్బంది ఉన్నారు. 60 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అరకొర సిబ్బందితోనే పోలీస్‌శాఖ విధులు నిర్వహిస్తున్నది.

నాగర్‌కర్నూల్ జిల్లాలో మొదటిసారిగా నియోజకవర్గంలో రత్నగిరి ఫౌండేషన్ సహాయంతో డ్రగ్స్ గంజాయి మాదకద్రవ్యాలపై ప్రజలకు, యువకులకు అవగాహన కల్పించిన పోలీసుల పనితీరును అందరూ ప్రశంసించారు. ఇదిలా ఉండగా పెంట్లవెల్లి మండల కేంద్రంలో ఉన్న పోలీస్‌స్టేషన్ తెలుగు ముదిరాజ్ కమ్యూనిటీ భవనంలో కొనసాగుతోంది. అరకొర వసతుల మధ్య చిన్న గదుల్లో విధులు చేపడుతున్నారు. ఇక్కడ అన్ని వసతులతో కూడిన పోలీస్‌స్టేషన్ పక్క భవనం నిర్మించాల్సి ఉంది. ఇప్పటికైనా జిల్లా పోలీస్‌శాఖ వెంటనే స్పందించి నియోజకవర్గ వ్యాప్తంగా నాలుగు మండలాల్లో ఖాళీగా ఉన్న పోలీస్ పోస్టులను భర్తీ చేయాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

సైబర్ మోసగాళ్ల ముఠా అరెస్టు

- తొమ్మిది మంది అదుపులోకి.. కోర్టుకు తరలింపు

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు



అదుపులోకి తీసుకున్న ప్రధాన నిందితులను మీడియాకు చూపుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు

కొత్తకోట, సెప్టెంబరు 13: జిల్లాలో సైబర్ నేరాలకు పాల్పడుతున్న ముఠాను అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు చెప్పారు. మొత్తం తొమ్మిది మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. కొత్తకోట పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు. పెద్దమందడి మండల ముందరితండాకు చెందిన కిషన్ ఆలియాస్ కృష్ణ(38) జీవనోపాధి కోసం సౌదికి వెళ్లి 2013లో ఇండియాకు వచ్చాడు. అనంతరం హైదరాబాద్ వెళ్లి ఆటో నడుపుతూ స్నేహితుడు రమేష్ సైబర్ నేరాలు చేస్తూ బాగా డబ్బు సంపాదిస్తున్నడని తెలుసుకొన్నాడు. తాను కూడా సంపాదించాలని నిర్ణయించుకుని స్నేహితుడి ద్వారా బీహార్ రాష్ట్రం పట్నాకు వెళ్లి నరేష్, హరీష్‌తో సైబర్ నేరాలపై శిక్షణ పొందాడు. ఈక్రమంలోనే రుణాలు ఇస్తామని పేర్కొంటూ పట్నా, హైదరాబాద్, ఢిల్లీ, కలకత్తా, వనపర్తిలో ముద్ర, ఇండియా బుల్స్, లోకల్ యాప్‌ల ద్వారా ఫోన్ నెంబర్లకు లింకులు పంపేవాడు. రుణాల కోసం లింకులు నొక్కిన వారిని ఫోన్‌లో సంప్రదించి, మొదటగా మీకు ఇచ్చే రుణాలకు ఇన్సూరెన్స్ చేయాలని, అందుకు కొంతడబ్బు పంపాలని చెప్పేవాడు. అలా చాలామంది ద్వారా డిపాజిట్ చేసిన డబ్బులతో స్వగ్రామంలో ఆధునిక వసతులతో రూ.65లక్షల విలువ చేసే బంగ్లా కట్టుకున్నాడు. రూ.7లక్షల విలువైన కారు, వనపర్తిలో ప్లాట్లు కొనుగోలు చేశాడు. అంతటితో ఆగకుండా తాను ఉంటున్న తండాలోనే పలువురికి సైబర్ మోసాలపై శిక్షణ ఇచ్చాడు. ఈ నేపథ్యంలోనే జిల్లాలో 12మంది సైబర్ నేరాల బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టిన సైబర్‌క్రైం డీఎస్పీ రత్నం, కొత్తకోట సీఐ రాంబాబు, శ్రీరంగాపూర్ ఎస్సైలు మంజునాథ్‌రెడ్డి, వెంకటేశ్వర్లు సైబర్ నేరగాళ్ల ముఠాను గుర్తించారు. వారిలో కిషన్, నర్సింగ్ నాయక్, కరుమూర్తి, రాతలవత్ రమేష్, ఇస్లావత్ రాములు, కొత్తపల్లి ఉమేష్, వీరేష్‌తో పాటు మరో ఇద్దరు మైనర్లు ఉన్నారు. కిషన్‌ను శుక్రవారం అదుపులోకి తీసుకోగా, మగితా వారిని రెండ్రోజుల ముందే అదుపులోకి తీసుకొన్నామని, శుక్రవారం అందరినీ కోర్టులో హాజరుపర్చామని డీఎస్పీ తెలిపారు. వారి నుంచి కారు, ప్లాట్ల డాక్యుమెంట్లు, బ్యాంకు పాసుబుక్కులు, పాస్‌పోర్టు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి టోర్నీలో పతకాలు సాధించాలి

- జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర

- ఉత్సాహంగా జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపికలు



అథ్లెటిక్స్ ఎంపికలను ప్రారంభిస్తున్న దృశ్యం

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 13: రాష్ట్రస్థాయి టోర్నీలో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించాలని జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర అన్నారు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో ఈనెల 19, 20వ తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అంతర్‌జిల్లాల అథ్లెటిక్స్ చాంపియన్‌లో పాల్గొనే జిల్లా అండర్-14, 16, 18, 20 సంవత్సలోపు బాల, బాలికల జట్ల ఎంపికలన శుక్రవారం స్థానిక స్టేడియం మైదానంలో నిర్వహించారు. ఎంపికలను జిల్లాఅథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర, జిల్లా ఒలింపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి పుట్టి సురేష్ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా శరత్‌చంద్ర మాట్లాడుతూ ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి జాతీయస్థాయికి ఎంపిక కావాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో కోచ్ ఆనంద్, వ్యాయమ ఉపాధ్యాయులు శ్రీనివాసులు, దత్తాత్రేయ, మేరిపుష్ప, మోయిన్, రాజు పాల్గొన్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి



వెంకటయ్య(ఫైల్)

తెలకపల్లి, సెప్టెంబరు 13: మండల ప రిధిలోని గౌరారంలో పాముకాటుకు గురై ఓవ్యక్తి మృతి చెందాడు. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గ్రా మానికి చెందిన పి.వెంకటయ్య(45) గురు వారం సాయంత్రం తన పొలంలో గట్టుపై పడుకుని ఉండగా పాముకాటుకు గురయ్యాడు. విషయం కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో వారు జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అనధికార వైద్య సేవలు

» వనపర్తి జిల్లాలో సొంత వైద్యం చేస్తున్న ఆర్ఎంపీలు

» పట్టించుకోని వైద్య ఆరోగ్య శాఖ



పెబ్బేరులో వైద్యం వికటించి మృతి చెందిన ఆర్ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేస్తున్న అధికారులు (ఫైల్)

వనపర్తి క్రైమ్, సెప్టెంబరు 13: జిల్లాలో అనధికార ఆసుపత్రులు ఏర్పాటు చేసుకుని, ప్రథమ చికిత్సలు మాత్రమే అందించాల్సిన కొంతమంది ఆర్ఎంపీ, పీఎంపీలు వైద్య సేవలు అందిస్తు ప్రజల నుంచి అందిన కాడికి దోచుకుంటున్నారు. జిల్లా కేంద్రంతో పాటు గ్రామ గ్రామాన ఈ వ్యాపారం కొనసాగుతుంది. వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో ఆర్ఎంపీ, పీఎంపీల వద్ద రోగుల రద్దీ పెరిగింది.

ఆర్ఎంపీలు, పీఎంపీలతో కుమ్మక్కు

జిల్లా కేంద్రంతో పాటు పెబ్బేరు, కొత్తకోట, ఆత్మకూరు, అమరచింత మునిసిపాలిటీలలో, మండల కేంద్రాలలో కొంతమంది మెడికల్ షాపుల యజమానులతో ఆర్ఎంపీ, పీఎంపీలు కుమ్మక్కై ముందు మెడికల్ షాపు, వెనకాల అనధికార ఆసుపత్రులను ఏర్పాటు చేసుకున్నారు. ఒక్కో ఆర్ఎంపీ మూడు నుంచి నాలుగు బెడ్‌లను ఏర్పాటు చేసుకొని వైద్యం అందిస్తున్నారు. అక్కడే ఉన్న మెడికల్ షాపునకు వెళ్లి అక్కడే రాసిన మందులను కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

అన్ని రకాల సేవలు

వర్షాకాలం వ్యాధుల సీజన్ నేపథ్యంలో గ్రామాలలో ఉన్న రోగులు ఆర్ఎంపీల వద్దకు వెళ్తున్నారు. ఇది ఆసరాగా చేసుకుని రెండు రకాల గ్లూకోజ్ బాటిల్ ఎక్కించడం, ఇంజక్షన్లు ఇస్తూ వారి దగ్గర నుంచి రూ.300 నుంచి రూ.800 దాకా వసూలు చేస్తున్నారు. రోగి వద్ద నుంచి రక్త నమూనాలను సేకరించి వారికి పరిచయం ఉండి కమిషన్ ఇచ్చే ల్యాబ్‌కు పంపి రిపోర్టు ఆధారంగా వారే మరిన్ని మందులను ఎక్కువగా ఇస్తున్నారు. కనీసం ఒక్కో పేషెంట్‌కు రూ.600 నుంచి రూ.వెయ్యి దాకా వసూలు చేస్తున్నారు.

దృష్టి సారించని వైద్య ఆరోగ్య శాఖ

జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల వైద్యసేవలు, రక్తపరీక్షలు నిర్వహిస్తున్నారు. వాటిపై జిల్లా ప్రజలకు అవగాహన కల్పించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆర్ఎంపీ, పీ ఎంపీలు క్లినిక్‌లను ఏర్పాటు చేసుకుని దర్జాగా అనధికార వైద్య సేవలు చేస్తున్నారు. దీంతో జిల్లాలో పలువురు వైద్యం వికటించి మృతి చెందిన దాఖలాలు కూడా ఉన్నాయి.

మూడు రోజుల క్రితం పెబ్బేరు పట్టణంలోని ఆర్ఎంపీ వైద్యం వికటించి ఓ బాలుడు మృతి చెందిన విషయం తెలిసిందే. ఇలాంటి ఘటనలు జిల్లాలో చోటు చేసుకుంటున్న వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పరిమితి మించితే చర్యలు



జిల్లాలోని ఆర్ఎంపీ, పీఎంపీలు వారి పరిమితికి మించి వైద్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ప్రథమ చికిత్స అందించాలి. సెలైన్ బాటిల్ ఎక్కియడం, ఇంజక్షన్లు ఇవ్వడం చేస్తే చర్యలు తీసుకుంటాం. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే ఉపేక్షించేది లేదు. అలాంటి వారు ఎవరైనా ఉంటే మాకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరుతున్నాం.

- జయచంద్ర మోహన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ధన్వాడ, సెప్టెంబరు 13: మండలంలోని కొండాపూర్ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు అభిలాష్, అరవింద్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బేస్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారని ఫిజికల్ డైరెక్టర్ రాంమోహన్‌గౌడ్ తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన సందర్భంగా వారిని ప్రిన్సిపాల్ రాజారాం, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, పీఈటీ సుగుణాకర్‌రావు అభినందించారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు..

కోయిలకొండ, సెప్టెంబరు 13: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో 8వతరగతి విద్యార్థి ముసాయిబ్‌అహ్మద్ రాష్ట్రస్థాయి ఖోఖో సబ్‌జూనియర్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం వెంకట్‌జీ, పీఈటీ మొగులాల్ తెలిపారు. మక్తల్‌లో నిర్వహించిన ఖోఖో పోటీల్లో ప్రతిభ చాటి ఎంపికయ్యాడని తెలిపారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు మహిళలు అదృశ్యం

దేవరకద్ర, సెప్టెంబరు 13: వివాహిత అదృశ్యమైన ఘటన మండలంలోని బల్సుపల్లిలో చోటుచేసుకున్నది. స్థానిక ఎస్ఐ నాగన్న కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తిరుమలేష(35) అనే వివాహిత దేవరకద్రకు వెళ్లి వస్తాని ఇంట్లో చెప్పి కుమారుడి(3)తో కలిసి ఆగస్టు 31న వెళ్లింది. తిరిగి రాకపోవడంతో తండ్రి చంద్రన్న పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదుచేశారు. ఈమేరకు కేసునమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

తిప్పడంపల్లిలో..

ఆత్మకూరు, సెప్టెంబరు 13: ఆత్మకూరు మండలంలోని తిప్పడంపల్లిలో ఓ వివాహిత కనిపించకుండా పోవడంతో ఆమె తండ్రి పోలీసులను ఆశ్రయించాడు. గ్రామానికి చెందిన ఎర్ర గట్టన్న, తన కూతురు సునీతను అమరచింత మండలం కొంకనివానిపల్లికి చెందిన ఆంజనేయులుకు ఇచ్చి ఏడేళ్ల క్రితం వివాహం చేశారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. రాఖీ పౌర్ణమి రోజున పుట్టింటికి వచ్చిన సునీత కుటుంబ కలహాల నేపథ్యంలో తిరిగి భర్త వద్దకు వెళ్లలేదు. ఈక్రమంలోనే ఈనెల 12న ఉదయం 11గంటల సమయంలో ఆరోగ్యం బాగాలేదు. ఆత్మకూరు ఆసుపత్రికి వెళ్లి వస్తానని చెప్పి తన చిన్నకుమారుడు నిశాంత్‌ను తీసుకుని వెళ్లింది. సాయంత్రం వరకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్లకు వెళ్లి వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి ఎర్ర గట్టన్న శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నరేందర్ తెలిపారు.

రేవల్లిలో..

ఊర్కొండ, సెప్టెంబరు 13: మండలంలోని రేవల్లి గ్రామానికి చెందిన సుహాసిని(33) భర్తతో కలిసి కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నది. సంవత్సరం నుంచి ఆమె కల్లుకు బానిస కావడంతో స్వగ్రామంలో ఉంటే మారుతుందని, మూడునెలల క్రితం భర్త, భార్యతో కలిసి గ్రామానికి వచ్చి ఇక్కడే ఉంటున్నారు. ఇక్కడ కూడా కల్లు తాగి పిచ్చిపిచ్చిగా వ్యవహరిస్తుండటంతో భర్తతో పాటు కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో ఆగస్టు 22న ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు బంధువులు, ఇతరప్రాంతాల్లో ఎంత వెతికినా ఆచూకీ లేకపోవడంతో భర్త పోలె శివశంకర్ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వీరబాబు తెలిపారు.

నల్లబెల్లం, పటిక పట్టివేత

కల్వకుర్తి, సెప్టెంబరు 13: కల్వకుర్తి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో చేపట్టిన విస్తృత తనిఖీల్లో నల్లబెల్లం, పటిక భారీగా పట్టుబడిందని ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని తర్నికల్‌తండాకు చెందిన మూడావత్ వినోద్, గోపాల్, వెల్దండ మండలం సిలోనిబాయితండాకు చెందిన మునియాలు అశోక్ లేల్యాండ్ వాహనంలో 2100కేజీల నల్లబెల్లం, 40కేజీల పటిక, 10లీటర్ల నాటుసారా తరలిస్తుండగా గుర్తించామని, సీజ్ చేసి, కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ తెలిపారు. సిబ్బంది నర్యా పరుశరాములు, భిక్షపతి, నజీర్, తూద్యా, భీమమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

మల్దకల్, సెప్టెంబరు 13: అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన ఘటన మం డలంలోని మద్దెలబండలో శుక్రవారం చోటుచేసుకున్న ది. గ్రామానికి చెందిన బో య నర్సింహులు(40) గురువారం రాత్రితన వ్యవసాయ పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. శుక్రవారం తన బావమరిది పొలానికి వెళ్లిచూడగా మృతి చెంది ఉన్నాడు. మరణానికి గల కారణాలు తెలియరాలేదు. మృతుడి తండ్రి నర్సింహ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై ఈశ్వరయ్య తెలిపారు.

బైకులు ఢీ: ఇద్దరికి స్వల్ప గాయాలు

ఊర్కొండ, సెప్టెంబరు 13: నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండల కేంద్రంలోని కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారిపై ఉన్న ఊర్కొండ గేటు నుంచి గ్రామంలోకి వచ్చే రహదారిలో రెండు బైకులు ఎదురెదురుగా ఢీ కొని ఇద్దరికి స్వల్ప గాయాలైన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఊర్కొండకు చెందిన రామస్వామి గేటు వైపు వెళతుండగా కాటన్ మిల్లు కార్మికుడు వినోద్ నిత్యావసర వస్తువుల నిమిత్తం గేటు వైపు నుంచి గ్రామంలోకి వస్తుండగా రాము ముదిరాజ్ హోటల్ వద్ద రెండు బైకులు ఢీకొని ఇద్దరికి స్వల్ప గాయాలు అయినట్లు స్థానికులు తెలిపారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

జడ్చర్ల, సెప్టెంబరు 13 : జడ్చర్ల మునిసిపాలిటీతో పాటు మండలంలోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి పంపిణీ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 106 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.

చెరువులు, కుంటలను కాపాడాలని వినతి

జడ్చర్ల, సెప్టెంబరు 13 : జడ్చర్ల మునిసిపాలిటీతో పాటు మండలంలోని చెరువులు, కుంటలను కాపాడాలని, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లను ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నారంటూ జలవనరుల సంరక్షణ ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు శుక్రవారం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయంలో నాయకులు తెలుగు సత్తయ్య, యాదగిరిలు కలుసుకుని వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీలోని నల్లకుంటతో పాటు ఇతర చెరువు, కుంటల అంశంలో ఇప్పటికే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లానని ఐక్యవేదిక నాయకులకు ఎమ్మెల్యేకు తెలిపారు.

● జీవో నెంబరు 81ని సవరణ చేసి న్యాయం చేయాలంటూ 55 నుంచి 61 సంవత్సరాల మధ్య వయస్సున్న వీఆర్‌ఏలు శుక్రవారం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

మహిళల సంక్షేమమే లక్ష్యంగా పాలన

- కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 13 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాపాలన ఏర్పడిన తరువాత మహిళల సంక్షేమానికి పెద్దపీట వేసి ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన కొద్దినెలల్లోనే మహబూబ్‌నగర్ అర్బన్ పరిధిలో 1008 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 57 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. మహిళలు ప్రభుత్వానికి అండగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్, వైస్‌చైర్మన్ మహ్మద్ షబ్బీర్‌అలీ, తహసీల్దార్ ఘన్సీరాం, నయాబ్, నాయకులు బెక్కరి అనితమధుసూదన్‌రెడ్డి, మోసిన్, మోయిన్, వెంకటేశ్ పాల్గొన్నారు.

బుద్ధుని మార్గంలో నడుద్దాం

హన్వాడ : గౌతమబుద్ధుడు చూపిన మార్గంలో మనమంతా పయనిద్దామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బుద్దారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై డబుల్ డెస్క్ బెంచీలను అందజేశారు. బుద్దాస్ లైట్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ వారి సౌజన్యంతో 40 డబుల్ డెస్క్ బెంచీలను పాఠశాలకు ఇవ్వడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

సభ్యులు ఉపాక, పార్టీ జిల్లా నాయకులు సుధాకర్‌రెడ్డి, మహేందర్, కృష్ణయ్య, అసోసియేషన్ సభ్యులు నాగన్న, ప్రవీణ్, తహసీల్దార్ కిష్టానాయక్, ఎంపీడీవో యశోద, నాయకులు సిరాజ్, లక్ష్మన్, వెంకటాద్రి, కలీం పాల్గొన్నారు.

●పరామర్శ : మండలంలోని నాయినోనిపల్లి గ్రామంలో కార్యకర్త దశరథ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శుక్రవారం ఆ గ్రామానికి వెళ్లి బాధితున్ని పరామర్శించారు. ఆయన వెంట మండల, గ్రామ నాయకులు నర్సిములు, మోహన్, తిరుపతయ్య ఉన్నారు.

మునిసిపల్ కౌన్సిల్‌లో ప్రొటోకాల్ రగడ

- **తమకు తెలియకుండా తమ వార్డుల్లో పర్యటిస్తున్నారన్న బీఆర్‌ఎస్**
- **గతంలో లేవని నోళ్లు ఇప్పుడు లేస్తుండటం సంతోషం : చైర్మన్**
- **బీఆర్‌ఎస్ ఇతర సభ్యుల మధ్య వాగ్వాదం**
- **చైర్మన్‌కు మద్దతు తెలిపిన బీజేపీ, ఎంఐఎం సభ్యులు**
- **రూ.25 కోట్ల పనులకు ఆమోదం**

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 13 : తమ వార్డులలో తమకు సమాచారం లేకుండా పర్యటనలు చేస్తున్నారని, అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నారని, ఇలా చేస్తే ఇక కౌన్సిలర్లం తామెందుకని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన పలువురు ప్రశ్నించారు. ప్రజలు తమకు అత్యవసర పనులు చేయాలని అడిగినప్పుడు కొన్ని చేయాల్సి వస్తుందని చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ బదులిచ్చారు. గతంలో బీఆర్‌ఎస్ పాలనలో నిధులు కేటాయించకున్నా, పనులు కాకున్నా లేవని నోళ్లు, ఇప్పుడు లేస్తున్నాయని, ఇది ప్రజాపాలన చలువేనని, మీకు మాట్లాడే స్వేచ్ఛ రావడం సంతోషమేనని ఎద్దేవా చేశారు. శుక్రవారం పాలమూరు మునిసిల్ సమావేశ మందిరంలో మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. సమావేశం ప్రారంభం కాగానే బీఆర్‌ఎస్ కౌన్సిలర్ సంధ్య తన వార్డులో హైమాస్ట్ లైట్ తనకు తెలియకుండా ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. ఎర్రగుంట శ్మశానవాటికకు వెళ్లే దారిలో లైటింగ్ లేక ఇబ్బంది అవుతుందని, ఆ ప్రాంత ప్రజలు వచ్చి తనను కలిస్తే అత్యవసరం ఉందని ఏర్పాటు చేశామని చైర్మన్ చెప్పారు. తన వార్డులో పనులు చేసేటప్పుడు ఎందుకు సమాచారం ఇవ్వరని, మీ వార్డులలో ఇతర కౌన్సిలర్ వచ్చి చేస్తే మీకు ఎలా ఉంటుందని నిలదీశారు. పాతపాలమూరు 11వ వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్ మాట్లాడుతూ తన వార్డులోనూ తనకు తెలియకుండా వచ్చి కార్యక్రమాలు చేస్తున్నారని, ఇలా చేస్తే తామెందుకన్నారు. వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్ మాట్లాడుతూ మీకు ఫోన్ చేస్తే ఫోన్ లిఫ్ట్ చేయలేదని, ముందు ఫోన్ ఎత్తడం నేర్చుకోండని సూచించారు. 20వ వార్డు కౌన్సిలర్ అనంతరెడ్డి మాట్లాడుతూ తన వార్డులోనూ తనకు తెలియకుండానే బోరు ప్రారంభించారని ఇదేం పద్ధతని నిలదీశారు. బీఆర్‌ఎస్ సభ్యులతో బీజేపీ సభ్యుడు అంజనేయులు, ఎంఐఎం సభ్యుడు సాదతుల్లా వాగ్వాదానికి దిగారు. గతంలో మీరు లైట్లు ఇంట్లో పెట్టుకుని ఎవరికీ సమాచారం ఇవ్వలేదని, ఇదివరకు వార్డుకు రూ.30 లక్షలు వచ్చిన దాఖలాలు లేవని, ఇప్పుడు అన్ని పార్టీల సభ్యులకు పార్టీలకతీతంగా ప్రతీ వార్డుకు రూ.30-40 లక్షలు కేటాయించారని తెలిపారు. నాలుగేళ్లలో వార్డులకు నిధులు కేటాయించలేదని, ఆనంద్‌గౌడ్ చైర్మన్ అయిన తరువాత పెద్దఎత్తున నిధులు కేటాయించారని పలువురు సభ్యులు ప్రశంసించారు. రూ.25.13 కోట్ల అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్

మీకు ఇంట్రెస్ట్ లేకపోతే వెళ్లిపోండి : చైర్మన్ ఆనంద్‌గౌడ్

పార్టీలకతీతంగా ప్రతీవార్డుకు రూ.30-40 లక్షలు కేటాయించడం గతంలో ఎన్నడూ లేదని, ఇప్పుడు పెద్దఎత్తున నిధులు కేటాయిస్తే ఏం చేయాలో తెలియక ఉద్దేశ్యపూర్వకంగా ప్రొటోకాల్ పేరుతో గొడవ చేస్తున్నారన్న విషయం అర్థమైతుందని మునిసిపల్‌చైర్మన్ ఆనంద్‌గౌడ్ అన్నారు. మీకు ఇంట్రెస్ట్ లేకపోతే సభనుంచి వెళ్లిపోవాలని, ఇక్కడ అనవసరంగా రాజకీయం చేయవద్దని మండిపడ్డారు. ఒకరిద్దరు సభ్యులు తమ స్వలాభం కోసం చర్చను పక్కదారి పట్టిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలి

- జడ్చర్ల అదనపు కోర్టు న్యాయాధికారి ముద్దాసిర్

జడ్చర్ల, సెప్టెంబరు 13 : చట్టాలపై బాలికలు, మైనర్ బాలికలు అవగాహన కలిగి ఉండాలని జడ్చర్ల అదనపు కోర్టు న్యాయాధికారి ముద్దాసిర్ అన్నారు. జడ్చర్ల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడుతూ చట్టాలపై అవగాహన పెంచుకుని, చట్టాలను ఉపయోగించుకుని తమకు తాము కాపాడుకోవాలని సూచించారు. మైనర్ బాలికల కోసం కొన్ని ప్రత్యేకమైన చట్టాలున్నాయని, అందులో ప్రధానమైనది పోక్సో చట్టమని వివరించారు. కార్యక్రమంలో జడ్చర్ల కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగయ్య, న్యాయవాదులు మాలిక్ షాకీర్, విశ్వేశ్వర్, రాములు, పురుషోత్తం, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

గర్భిణులకు చికిత్సపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- మోతీనగర్ ఆస్పత్రి పరిశీలనలో కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), సెప్టెంబరు 13 : గర్భిణులకు అందించే చికిత్సపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. శుక్రవారం పట్టణంలోని మోతినగర్‌లో గల పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులలో భాగంగా మోతీనగర్‌లో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ కేసులు ఎక్కువగా వస్తున్నాయని, ఇందుకు సంబంధించిన లక్షణాలతో వచ్చే వారికి వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. ప్రతీ యూపీహెచ్‌సీ పరిధిలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వే చేపట్టాలని, జ్వరం, డెంగీ వ్యాధుల లక్షణాలతో బాధపడుతున్న వారి వివరాలు తీసుకోవాలని సూచించారు. రక్తనమూనాలు సేకరించి పాజిటివ్ వచ్చిన వారికి చికిత్స అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక, సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్రైడే-డ్రైడేను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

భూత్పూర్, సెప్టెంబరు 13: మునిసిపాలిటీలోని నాలుగవ వార్డులో మునిసిపల్ శాఖ అధికారులు, సిబ్బంది శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ తనిఖీ చేశారు. వార్డులో సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువలు అధ్వానంగా ఉండడంతో వెంటనే నిర్మించాలని మునిపల్ కమిషనర్ సురేందర్‌రెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈయన వెంట మునిసిపాలిటీ శాఖ అధికారులు, వార్డు కౌన్సిలర్ గడ్డం నాగమ్మ, యాదయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలి

- ఉత్తమ ఉపాధ్యాయుల సన్మానంలో డీఈవో రవీందర్

దేవరకద్ర, సెప్టెంబరు 13 : ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేసి విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపాలని డీఈవో ఎ. రవీందర్ అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలని అన్నారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైందన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు నవసమాజ నిర్మాతగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు. అనంతరం మండలంలోని 23 మంది ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో జయశ్రీ, ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ శ్రీనివాసులు, వివిధ గ్రామాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు రెగ్యులర్‌గా పాఠశాలకు రావాలి

గండీడ్, సెప్టెంబరు 13 : విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఏఎంవో దుంకుడు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గండీడ్ ప్రాథమిక పాఠశాల, ఆశిరెడ్డిపల్లి, కొంరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలు, ఆదర్శ పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీ చేసి 3, 6, 9వ తరగతి విద్యార్థుల ఎస్‌ఏఎస్ పరీక్ష ప్రశ్నాపత్రాలను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మంచి ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పని చేస్తా

- పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు శ్యాంబాబు

నవాబ్‌పేట, సెప్టెంబరు 13 : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడె ఏకైక సంఘం పీఆర్టీయూ తెలంగాణ అని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్యాంబాబు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కారుకొండ, కూచూర్, ఇప్పటూర్, లింగంపల్లి, నవాబ్‌పేట, పోమాల గ్రామాల్లో నాయకులతో కలిసి సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండితులు, పీఈటీల పదోన్నతుల ప్రక్రియ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పరిష్కారమవుతాయన్నారు. అనంతరం సంఘం జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్‌గా రామకృష్ణ, కోశాధికారిగా భీంరెడ్డిలను నియమిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు భూపతిసింగ్, నజీర్ అహ్మద్, మనోహర్, సీఆర్పీ జనార్దన్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో టోర్నీకి ఉమ్మడి జిల్లా జట్ల పయనం

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 13 : రాష్ట్రస్థాయి ఖోఖో టోర్నీ జిల్లా విజేతగా నిలువాలని జిల్లా ఖోఖో సంఘం సెక్రటరీ విలియం అన్నారు. హైదరాబాద్‌లో శనివారం నుంచి నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ ఖోఖో టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్లు తరలివెళ్లాయి. శుక్రవారం మోడ్రన్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జట్టు క్రీడాకారులను అభినందించారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దత్తు, శ్రీనివాసులు, రమేష్‌కుమార్, మన్యం, చక్రవర్తి, వెంకటేశ్, బాలరాజు, మొగులాల్ పాల్గొన్నారు.

డీఐఈవోగా కౌసర్ జహాన్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 13 : జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారిగా కౌసర్‌జహాన్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె శుక్రవారం డీఐఈవో కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న కౌసర్‌జహాన్‌కు డైరెక్టర్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారులు అదనపు బాధ్యతలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె కార్యాలయం సూపరింటెండెంట్, సిబ్బంది పుష్పగుచ్ఛం, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జీ డీఐఈవోగా ఉన్న ఉమామహేశ్వర్ జడ్చర్ల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కొనసాగనున్నారు.

విద్యార్థి ఉద్యమాల వేగుచుక్క ఏచూరి

- సీతారాం ఏచూరికి ఘన నివాళి అర్పించిన నాయకులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 13 : దివంగత సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం దేశానికి తీరనిలోటని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని వాగ్దేవి జూనియర్‌కళాశాలలో సీతారాం ఏచూరి సంతాప సభ ఎస్‌ఎఫ్‌ఐ అధ్వర్యంలో నిర్వహించారు. ప్రశాంత్ మాట్లాడుతు విద్యార్థి ఉద్యార్థి ఉద్యమాల వేడుచుక్క ఏచూరీ అని, విద్యార్థి సమస్యలపై నిరంతరం పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. ఆయన చూపిన మార్గంలో ఎస్‌ఎఫ్‌ఐ ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రాములు, జిల్లా అధ్యక్షుడు భరత్, డీవైఎఫ్‌ఐ నాయకులు భానుప్రసాద్ పాల్గొన్నారు.

● మహమ్మదాబాద్‌లో : మండల పరిధిలోని జూలపల్లి గ్రామంలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి ఘననివాళి అర్పించారు. ఆయన మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు గుండుమల్ల నర్సిములు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జంబుల బాల్‌రెడ్డి, నాయకులు బోయిన రాజు, కొత్త కేశవులు, జోగు లాలయ్య, జుంటుపల్లి అంజిలయ్య, తిరుపతయ్య, రాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు .

● జడ్చర్ల : భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) జాతీయ కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరీ మృతికి సంతాపంగా శుక్రవారం ఆ పార్టీ నాయకులు ఘన నివాళ్లు అర్పించారు. జడ్చర్ల అంబేడ్కర్ చౌరస్తా వద్ద సీతారాం ఏచూరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జగన్, తెలుగు సత్తయ్య, లక్ష్మీదేవి, మున్నా, కేవీపీఎస్ నాయకులు పరశురాం, నాగరాజు, కార్మిక సంఘం నాయకులు చాంద్‌ఖాన్, ఉదయమిత్ర, బాలనరసింహ పాల్గొన్నారు.

● హన్వాడ : మండలంలోని మునిమోక్షం, హన్వాడలో శుక్రవారం సీపీఎం జాతీయ నేత సీతారాం ఏచూరి మృతికి నివాళి అర్పించారు. ఆయన పేదల, కార్మికుల కోసం ఎన్నో పోరాటాలు చేశారాని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు, మండల కార్యదర్శి లక్ష్మయ్య, నర్సిములు, మాణిక్యంరాజు, శ్రీకాంత్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

'వక్ఫ్ సవరణ బిల్లు వెనక్కి తీసుకోవాలి'

మహబూబ్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 13 : కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో పలు మసీదుల్లో వక్ఫ్ బిల్లు రద్దు చేయాలని కోరుతూ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం చేట్టారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ ఇసాక్ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు చట్టంలో అధికాలను హరిస్తూ వక్ఫ్ ఆస్తులపై నియంత్రణ సాధించడానికి కేంద్ర ప్రభుత్వం సవరణలు తీసుకొస్తున్నదని ఆరోపించారు. నాయకులు షకీల్‌ఖాన్, ఇమ్రాన్, అజహర్ పాల్గొన్నారు.

చికెన్, మటన్ చేపల వ్యర్థాల తరలింపునకు రీ టెండర్

జడ్చర్ల, సెప్టెంబరు 13 : జడ్చర్ల మునిసిపాలిటీ పరిధిలో చికెన్, మటన్, చేపల వ్యర్థాల తరలింపునకు శుక్రవారం రీ టెండర్ నిర్వహించారు. గత నెలలో నిర్వహించిన టెండర్‌లో రూ.70లక్షల50వేలకు కాంట్రాక్టర్ దక్కించుకున్నారు. కాగా నిబంధనల మేరకు చెల్లించాల్సిన రుసుమును చెల్లించకుండా, టెండర్‌ను విరమించుకోవడంతో మళ్లీ టెండర్ ప్రక్రియను నిర్వహించారు. మునిసిపల్ ఇంచార్జీ చైర్‌పర్సన్ పాలాది సారిక అధ్యక్షతన, మునిస్సిపల్ కమిషనర్ రాజయ్య సమక్షంలో రీ టెండర్ నిర్వహించారు. ఈ టెండర్‌లో ఏడుగురు పాల్గొనగా, బలరాముడు అనే వ్యక్తి రూ.41లక్షలకు దక్కించుకున్నాడని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

రైల్వే డబుల్‌లైన్‌కు భూసేకరణ

దేవరకద్ర, సెప్టెంబరు 13 : మండల కేంద్రంలో రైల్వే డబుల్‌లైన్‌కు భూసేకరణ చేస్తున్నట్లు భూసేకరణ అధికారి కలెక్టర్ శ్రీనివాస్, ఆర్‌ఐ శరత్ అన్నారు. బల్సుపల్లి గ్రామంలో జరుగుతున్న రైల్వే డబుల్‌లైన్ పనులను పరిశీలించారు.

ప్రతీ ఇంటికి సభ్యత్వం ఇవ్వాలి

- పార్టీ సభ్యత్వ నమోదులో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

హన్వాడ, సెప్టెంబరు 13 : భారతీయ జనతా పార్టీ సభ్యత్వాన్ని ప్రతీ ఇంటికి ఇవ్వాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హన్వాడలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధ్యత గల నాయకులు కనీసం వందకు తగ్గకుండా క్రియాశీల సభ్యత్వం ఇవ్వాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశం కోసం చేస్తున్న సేవలను ప్రజలకు వివరించాలని చెప్పారు. ఇప్పుడు చేసిన సభ్యత్వం రాబోయే రోజుల్లో సర్పంచి, ఎంపీటీసీ ఇతర ఎన్నికలకు కీలకంగా మారుతుందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు కృష్ణవర్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు డాక్టర్ వెంకటయ్య, సొసైటీ వైస్ చైర్మన్ కృష్ణయ్యగౌడ్, సుబ్రమణ్యం, మాజీ ఎంపీపీ వడ్ల శేఖర్, సభ్యత్వ నమోదు మండల కన్వీనర్ రమణారెడ్డి, కోకన్వీనర్ లింగన్న, రఘురాంగౌడ్, సుదర్శన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, శ్రీనివాసులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

దేవరకద్ర ఎమ్మెల్యేను పరామర్శించిన సీఎం సోదరుడు



చిన్నచింతకుంట, సెప్టెంబరు 13 : దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూదన్‌రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే. శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కృష్ణారెడ్డి జీఎంఆర్ నివాసానికి వెళ్లి క్రీ.శే.కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఎమ్మెల్యేతో పాటు సోదరుడు భాస్కర్‌రెడ్డి, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎం.సురేందర్‌రెడ్డి, నాయకులు వర్కటం జగన్నాథరెడ్డి, బాలకిష్టారెడ్డి తదితరులున్నారు. కాగా చిన్న వడ్డెమాన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వట్టెం శివకుమార్, అమ్రేష్, నర్సిహులు తదితరులు జీఎంఆర్‌ను పరామర్శించారు.

జీఎంఆర్‌ను పరామర్శిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కృష్ణారెడ్డి

బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

అడ్డాకుల/ నవాబ్‌పేట/ దేవరకద్ర/ భూత్పూర్/ మూసాపేట, సెప్టెంబరు 13 : బీఆర్‌ఎస్ హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌసిక్‌రెడ్డి ఇంటిపై ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ చేసిన దాడికి నిరసనగా మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపు మేరకు హైదరాబాద్‌కు తరలివెళుతున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలను శుక్రవారం జిల్లాలో ఎక్కడికక్కడా పోలీసులు అరెస్టు చేశారు. అరికెపూడి గాంధీ దాడికి పాల్పడడం హేయమైన చర్య అని విమర్శించారు. తమను పోలీసులు అరెస్ట్ చేయడం సమంజసం కాదని అన్నారు. అడ్డాకులలో అరెస్ట్ అయిన వారిలో చంద్రమోహన్‌రెడ్డి, రంగన్నగౌడ్, తిరుపతిరెడ్డి, ఖాజాహోరి, మహేశ్‌యాదవ్, రమేశ్ ఉన్నారు. ● నవాబ్‌పేటలో బీఆర్‌ఎస్ మండల నాయకులు మాడెమోని నర్సింహులు, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు లక్ష్మయ్య, తాహెర్‌తో పాటు మరికొంత మంది నాయకులను ఎస్‌ఐ విక్రం ముందస్తు అరెస్టు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మెండె శ్రీను, జైపాల్‌రెడ్డి, మల్లెపాగ నర్సింహులు ఉన్నారు. ● దేవరకద్రలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నరసింహారెడ్డితో పాటు నాయకులు నరేందర్‌రెడ్డి, బాలరాజు, చల్మారెడ్డి, యుగేందర్‌రెడ్డి, హన్మిరెడ్డి, రాధాకృష్ణ, జక్కిలను అరెస్టు చేశారు. ●

భూత్పూర్ ఎస్‌ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మునిసిపల్ చైర్మన్ బస్వరాజుగౌడ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సురేష్‌కుమార్‌గౌడ్, వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం ప్రేమ్‌కుమార్, మేకల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ నారాయణగౌడ్, అశోక్‌గౌడ్, మల్లేష్, శంకర్‌నాయక్, గడ్డం రాములును అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు. ● మూసాపేటలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు లక్ష్మీనర్సింహ యాదవ్, ఇతర నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి రాణాకు తరలించి సొంత పూచీకతతో వదిలేశారు. అరెస్ట్ ఇయిన వారిలో నాయకులు చంద్రశేఖర్, శ్రీనివాసులు, రఘురాములు, నర్సింహులుగౌడ్, దాసరి వెంకటేష్; బందిగి మహేందర్, కోట్ల రవి, మధు, బాలయ్య, రాజు, నర్సింహారెడ్డి, నాగరాజు, మన్నెం, ఆంజనేయులు, కేశవులు ఉన్నారు.

పూజలందుకుంటున్న వినాయకుడు


రాంనగర్‌లో గణేషుడిని దర్శించిన కాంగ్రెస్ నాయకుడు ఏపీ మిథున్‌రెడ్డి

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 13 : వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం కాంగెస్ నాయకుడు ఏపీ మిథున్ రెడ్డి పట్టణంలోని పలు మండపాలను సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయకచవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి పట్టణంలోని రాంనగర్, శివశక్తినగర్, బండ్లగేరి, పాతపాలమూరు, చిన్నదర్పల్లిలో వినాయక విగ్రహాలను దర్శించారు. వైష్ణోదేవి కాలనీలో వినాయక విగ్రహం వద్ద మహిళలు పూజలు చేశారు.


పాలమూరులోని వైష్ణోదేవి కాలనీలో వినాయక విగ్రహం ముందు కుంకుమార్చన చేస్తున్న కాలనీ మహిళలు

17న మిలాద్ ఉన్ నబీ ర్యాలీ

మహబూబ్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 13 : ప్రవక్త మహ్మద్ జయంతి మిలాద్ ఉన్ నబీ పురస్కరించుకొని ఈ నెల 17న మిలాద్ జులూస్, ధార్మిక సభ నిర్వహిస్తున్నట్లు అహ్లెసున్నతుల్ జమాత్ మిలాద్ కమిటీ ప్యాట్రన్ సయ్యద్ రజాక్ షా ఖాద్రీ వెల్లడించారు. శుక్రవారం షాసాబ్‌గుట్ట దర్గాలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఘన సన్మానం

భూత్పూర్, సెప్టెంబరు 13 : మండలంలోని అన్నాసాగర్ గ్రామ హైస్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు హెచ్‌ఎం విద్యాలత, సుధారాణి, ఉషారాణి, సమత, బాలమణి, సుజాత, వెంకటేష్, రాధ తదితరులు ఇటీవలే బదిలీపై వెళ్లారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో వారి స్థానంలో వచ్చిన తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లియోనా, జ్యోతి, విజయలక్ష్మి, శారద, చక్రవర్తిగౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

మిడ్జిల్‌లో కొడంగల్ కాంగ్రెస్ నాయకుల ఆందోళన

మిడ్జిల్, సెప్టెంబరు 13 : మండలంలోని మున్ననూర్ టోల్‌గేట్ వద్ద టోల్ బరియల్‌కు వైట్ కలర్‌తో పాటు బీఆర్‌ఎస్ కలర్ ఏర్పాటు చేశారంటూ మిడ్జిల్ నుంచి జడ్చర్ల వైపు వెళ్తున్న కొడంగల్ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఉద్దేశపూర్వకంగానే టోల్ బరియల్‌కు బీఆర్‌ఎస్ కలర్‌ను ఏర్పాటు చేశారని ధర్నా నిర్వహించారు. బరియల్‌కు రెడ్ కలర్‌తో పాటు వైట్ కలర్‌ను ఏర్పాటు చేయగా క్రమేన కలర్ పోయి డిమ్ముగా మారిందని టోల్‌గేట్ సిబ్బంది సమాధానమివ్వడంతో వారు వెళ్లిపోయినట్లు టోల్‌సిబ్బంది తెలిపారు.

'కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం'

నవాబ్‌పేట, సెప్టెంబరు 13 : మండలంలోని చౌదార్ మాజీ ఎంపీటీసీ గోపీకృష్ణ ఆధ్వర్యంలో గ్రామస్థులు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా దుశ్యంత్‌రెడ్డి వారికి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. వాసుయాదవ్, అమరేష్, రమేష్ పాల్గొన్నారు.